క్లుప్తంగా

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



కల్వకుర్తి రూరల్: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్‌లను టాప్ చేయడాన్ని నిరసిస్తూ బుధవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించడం దారుణమన్నారు. ధర్నా అనంతరం ఆర్డీఓ రాజేష్‌కుమార్‌కు వినతి అందజేశారు. శ్రీశైలం, శ్రీను, రమేష్, మహేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ పనుల అడ్డగింపు



వెల్దండ: మండలం బొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సల్లపల్లి మీదుగా 11కేవీ విద్యుత్ లైన్ తీసుకెళ్లవద్దని గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. గాన్‌గట్టుతండా సమీపంలో కంకర మిల్లు ఏర్పాటు చేశారు. మిల్లును నడిపించడానికి విద్యుత్‌లైన్ ఏర్పాటు చేస్తుండటంతో గ్రామంలో రోడ్లు చిన్నగా ఉన్నాయని, విద్యుత్‌వైర్లు ఇళ్లపై వెళ్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటాయని అడ్డుకున్నారు. వారి వెంట ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, రాజునాయక్, తిర్మల్‌రావు తదితరులు ఉన్నారు.

చిరుత సంచారంపై అటవీప్రాంతాల పరిశీలన



వెల్దండ: మండల పరిధిలోని రాచూర్, ఉర్కొండ మండలం ఇప్పపహాడ్ రెవెన్యూ శివారులో చిరుత సంచరిస్తున్నట్లు రైతులు సమాచారం అందించడంతో బుధవారం ఫారెస్టు అధికారులు అటవీ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు చూపిన ప్రాంతాలను పరిశీలించారు. ఎలాంటి చిరుత అనవాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందవద్దని అధికారులు రైతులకు సూచించారు. గతంలో ఈ ప్రాంతంలో హైనా(అడవి జంతువు) సంచరించి మేకలు, గొర్రెలు, లేగదూడలపై దాడులు చేసినట్లు తెలియజేశారు.


ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు



తెలకపల్లి: నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.తారాసింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని గాలికి వదిలేశారని, ప్రైవేటు శక్తులకు పాలక వర్గాలు కొమ్ము కాస్తున్నాయని విమర్శించారు. పాఠశాల విద్యలో ఉన్నత విద్యలో ఉపాధ్యాయ, వృత్తి విద్యలో అనేక విద్యార్థి వ్యతిరేఖ ప్రతిపాదనలు చేశారని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం నిధులు కూడా కేటాయించకుండా నూతన విద్యావిధానం ఎలా అమలు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అభిలాష్, బన్ని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పూజ

తాడూరు: మండల కేంద్రంలోని కొమ్ముగుట్ట వద్ద ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం మాలలు ధరించిన అయ్యప్పస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి అనురూప్‌శర్మ ఆధ్వర్యంలో పటం, కలశ పూజలు నిర్వహించారు.



సృజనాత్మకతను వెలికి తీయాలి

కొల్లాపూర్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్డీఓ హనుమనాయక్, విద్యాశాఖ జిల్లా పర్యవేక్షణాధికారి సతీష్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎం గార్డెన్‌లో టీఎల్ఎం మేళా నిర్వహించారు. భిన్నమైన పద్ధతుల్లో బోధనా తీరుకు సంబంధించిన పలు అంశాలను పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు ప్రదర్శించారు.

ఆకట్టుకున్న మేళా

అచ్చంపేట రూరల్: ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో తొలిమెట్టు బోధనా అభ్యసన సామగ్రి మేళాను నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన 350 అభ్యసన సామగ్రిలను ప్రదర్శించారు. సాయంత్రం డీఈఓ గోవిందరాజులు హాజరయ్యారు. ఎంఈఓ రామారావు, మనోహర్, మంత్రియానాయక్ పాల్గొన్నారు.

అమ్రాబాద్: మండల కేంద్రం ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన అమ్రాబాద్, పదర మండలాల స్థాయి టీఎల్ఎంఎల్ మేళా ఎంతగానో ఆకట్టుకుంది. రెండు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు బోధనోపకరణ సామగ్రిని తయారు చేసి ప్రదర్శనకు ఉంచారు.

ఊర్కొండ: మండలంలోని ఎంపీహెచ్ఎస్ పాఠశాలలో మండ స్థాయి టీఎల్ఎం మేళా పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి హాజరై మాట్లాడారు. టీఎల్ఎం చాలా బాగుందని, ఉపాధ్యాయులు కష్టపడుతున్నారని అన్నారు. ఎంఈఓ బాసునాయక్, నోడల్ ఆఫీసర్ వెంకటరమణ పాల్గొన్నారు.



ఊర్కొండలో మాట్లాడుతున్న శాంతకుమారి

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

చారకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట వేసి అభివృద్ధికి కృషి చేస్తుందని నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్ అన్నారు. మండల కేంద్రంలో జీహెచ్ఎం శంకర్ నాయక్ ఆధ్వర్యంలో పాఠశాలలో టీఎల్ఎం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ హాజరయ్యారు.

పెంట్లవెల్లి: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ పంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు రకాల ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల ప్రదర్శనలను ఎంపీపీ ఉమామహేశ్వరి, జెడ్పీటీసీ చిట్టెమ్మ, సర్పంచ్ సువర్ణమ్మ సందర్శించారు. మొదటి బహుమతి బోధనాభ్యాసన సామగ్రి మేళలో గణితశాస్త్రంలో యూపీఎస్ మంచాలకట్ట పాఠశాలకు మొదటి బహుమతి పొందింది.



కొల్లాపూర్‌లో ఎంపీపీ బోజ్యానాయక్

బల్మూర్: మండలంలోని కొండనాగుల ప్రాథమిక పాఠశాలలో బుధవారం మండల స్థాయి బోధన సామగ్రి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి బోదనాభ్యస సామగ్రిని విద్యార్థులు ప్రదర్శించారు. మొత్తం 264 ప్రదర్శనలు చేశారు. ఎంపీపీ అరుణ, ఎంఈఓ రామారావు, నోడల్ అధికారి జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమాన్ని జెడ్పీటీసీ మేకల గౌరమ్మ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన, అభసన సామగ్రి మేళను ఉపయోగించి బోధన చేపడితే పాఠ్యాంశాలు అర్థమవుతాయని తెలియజేశారు.



అచ్చంపేటలో మెళాను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాఠశాల బలోపేతానికి కృషి చేయాలి

కోడేరు: పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించి పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని జిల్లా మానిటరింగ్ అధికారి సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి తెలుగు, ఆంగ్లం, గణితంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు చేసిన పరికరాలను పరిశీలించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి అందజేశారు.

మేడిపూర్ విద్యార్థుల ప్రతిభ

తాడూరు: మండల స్థాయి సాంఘికశాస్త్రంపై నిర్వహించిన ప్రతిభా పరీక్షలో మేడిపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సంబింబ్‌బేగం, రాజ్యలక్ష్మిలు టాపర్లుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఎంపికైన విద్యార్థులకు హెచ్ఎం బిక్షారావు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.



అమ్రాబాద్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ



చారకొండలో పరిశీలిస్తున్న అధికారులు



పెద్దకొత్తపల్లిలో..



కోడేరులో..



పెంట్లవెల్లిలో..

అంధులకు జీవనభద్రత కల్పించాలి

కొల్లాపూర్: అంధులకు జీవనభద్రత కల్పించాలని ఇందిరాగాంధీ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు రంగినేని జగదీశ్వరుడు కోరారు. బుధవారం పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో ప్రపంచ అంధుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. న్యాయవాది మధుసూదన్‌రావు, వెంకటస్వామి, జమీల్‌అహ్మద్‌ఖాన్, మెయిదీనవాజ్ తదితరులున్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు.



నాగర్‌కర్నూల్‌లో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న దివ్యాంగులు

20 సంత్సరాల యువకుడైన బ్రెయిలీ నూతన పద్ధతి సిద్ధాంతీకరించి 5 సంవత్సరాల పరిశోధనలో సంపూర్ణత సాధించాడని పేర్కొన్నాడు. అంధులకు కావాల్సిన భాషా విధానాన్ని రాతపూర్వకంగా రాయొచ్చని సూచించిన వ్యక్తి అని కొనియాడారు. జిల్లా మహిళా కన్వీనర్ తిరుపతమ్మ, లక్ష్మీదేవి, శ్రీనివాసులు, ఆంజనేయులు, లింగమ్మ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు స్త్రీనిధి సురక్షతో భరోసా

పెంట్లవెల్లి: స్త్రీనిధి సురక్ష పథకం ద్వారా మహిళా సంఘ సభ్యులకు భరోసానిస్తుందని రుణం పొందిన సభ్యురాలు అనుకోని రిత్యా మృతిచెందితే ఆ సంఘానికి గాని ఆ కుటుంబానికి గాని స్త్రీనిధి ద్వారా ఇన్సూరెన్స్ డబ్బును భరోసాగా అందిస్తుందని, అంతే కాకుండా రుణ చెల్లింపులు నిలుపుదల చేస్తారని పెంట్లవెల్లి సమాఖ్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ గౌస్‌ద్దీన్ అన్నారు. అందులో భాగంగానే అన్ని గ్రామాల సంఘాల ప్రజాప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెంట్లవెల్లికి చెందిన సంతోషి మహిళా సంఘానికి చెందిన బత్తిని మల్లమ్మ మృతిచెందడంతో ఆమె కుటుంబానికి బుధవారం స్త్రీనిధి సురక్ష ఇన్సూరెన్స్ ద్వార రూ.లక్ష రుణమాఫీ చేయడంతో పాటు మరో రుణం చెల్లించిన రూ.50 వేల మొత్తాని తిరిగి ఆమె కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. గౌస్‌ద్దీన్, విక్రమ్ కుమార్, శోభారాణి, మంతమ్మ, చెన్నమ్మ, మధుగౌడ్ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న విక్రమ్‌కుమార్

విద్యార్థుల సమస్యలు విస్మరిస్తున్న ప్రభుత్వం

నాగర్‌కర్నూల్ రూరల్: పాలక ప్రభుత్వాలు విద్యారంగాన్ని, విద్యార్థుల సమస్యలను విస్మరిస్తూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా అన్యాయం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ ఆరోపించారు. బుధవారం జిల్లా సంక్షేమ హాస్టల్స్‌లో నూతన కన్వీనర్ కమిటీ ఎంపిక చేసి మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా నాయకులు స్టీఫెన్, తరుణ్, మధు, సందీప్, అఖిలేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మిరపపంట రైతులను ఆదుకోవాలి

తాడూరు: అకాల వర్షాలు, తెగుళ్లతో మిరపపంటతో నష్టపోయిన రైతులను ఆదుకొని ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం సహాయ కార్యదర్శి వార్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గుంతకోడూరులో రైతులు సాగు చేసిన మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామంలో దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా రైతులు కుబేరకలాస్ కంపనీలకు చెందిన మిరప పంటలను సాగుచేశారు. గ్రామానికి చెందిన చంద్రయ్యగౌడ్, సుల్తాన్, శ్రీశైలం, నిరంజన్‌గౌడ్ సాగు చేసిన మిరప పంటలను పరిశీలించి వారికి ప్రభుత్వపరంగా ఆదుకునేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణాజీ, బాలమురళి, శివశంకర్, శ్రీనివాసులు, శ్రీశైలం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మిరపపంటను పరిశీలిస్తున్న నాయకులు

యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కల్వకుర్తి: పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కోరారు. బుధవారం పోటీ పరీక్షల నిపుణులు ఉపాధ్యాయుడు బాలరాజు నిరుద్యోగుల కోసం కాంపిటీషన్ పుస్తకాలను చైర్మన్ సత్యం ద్వారా కల్వకుర్తి శాఖ గ్రంథాలయానికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యం మాట్లాడారు. పోటీ పరీక్షల రంగంలో అగ్రగామి సంస్థ ఎస్అండ్ఎస్ పబ్లికేషన్ పుస్తకాలు కల్వకుర్తి ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. సైదులుగౌడ్, అమల, లక్ష్మీనరసింహారావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దాతలు సహకరించాలి



కందనూలు: ప్రత్యేక తరగతులతో ఎస్ఎస్‌సీ పరీక్షలకు సిద్ధం అవుతున్న పేద విద్యార్థుల అల్పాహారానికి దాతలు సహకరించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.కురుమయ్య కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో(1992 బ్యాచ్) చదివిన మిడిదొడ్డి శేఖర్ విద్యార్థుల అల్పాహారం కోసం రూ.5 వేల నగదు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బిల్లకంటి రవికుమార్, పి.శేఖర్ బాబు, యాదగిరి, సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకులకు గాయాలు

లింగాల: మండల కేంద్రానికి సమీపంలోని మగ్దూంపూర్ చౌరస్తాలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. లింగాలకు చెందిన దివాకర్, అంజి, ఆంజనేయులు ద్విచక్రవాహనంపై తెల్కపల్లి వైపు వెళ్తుండగా.. తెల్కపల్లి వైపు నుంచి లింగాలకు వస్తుండగా.. ఓ ప్రైవేటు వాహనం బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో దివాకర్ అనే యువకుడి ఎడమ కాలు విరిగినట్లు తెలిసింది. క్షతగాత్రులను 108 అంబులెన్సులో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ శ్రీనివాసులు పరిశీలించారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని మోతి వైన్స్‌లో కల్తీ మద్యం తాగి మృతిచెందిన కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. బుధవార మద్యం తాగి మృతిచెందిన నల్లవెల్లికి చెందిన చంద్రయ్య మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్తీ మద్యంతో నిండు ప్రాణాలు బలయ్యాయని, ఆ కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన వడ్డె లక్ష్మయ్య మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శించి తక్షణ సాయంగా కొంత నగదు అందజేశారు.

గ్రామాభివృద్ధిని విస్మరించిన ప్రజాప్రతినిధులు

పెద్దకొత్తపల్లి: ప్రస్తుత అధికార పార్టీ నాయకులు గ్రామాల అభివృద్ధిని విస్మరించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. కొల్లాపూర్ ప్రగతి యాత్రలో భాగంగా బుధవారం మారేడుమాందిన్నెలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్ నుంచి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. శశికళ, ప్రవీన్‌కుమార్, బీమేష్, శివుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ తనిఖీ



తాడూరు: మండలంలోని పోల్మూరు గ్రామపంచాయతీని ఎంపీడీఓ గంగామోహన్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులన్నింటిని పరిశీలించి పంచాయతీ కార్యదర్శి సరితకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం పన్నుల వసూలు, గ్రామపంచాయతీ పరిధిలో ఎలాంటి పెండింగ్ పనులు ఉన్న పూర్తి చేయించాలని తెలియజేశారు.

తహసీల్దార్‌కు వినతి

తెలకపల్లి: మండల కేంద్రం శివారులోని క్వారీ వద్ద పంటపొలాల్లో నీరు వదలడంతో పంటలు నష్టపోతున్నామని బాధితులు తహసీల్దార్‌కు వినతి అందజేశారు. గతంలో గ్రానైట్ కోసం క్వారీ తీసి పెద్ద ఎత్తున ఏర్పడి గుంతలో నీరు చేరిందని, కొందరు వారి పొలాల కోసం క్వారీలోని నీటిని నిత్యం తోడేయడంతో కొంత మంది పంటపొలాల మీదుగా నీరు పారి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

మొక్కల పెంపకానికి నర్సరీలను సిద్ధం చేయాలి



వెల్దండలో మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

వెల్దండ: హరితహారంలో నాటిన మొక్కలను రక్షించుకోవాలని, మొక్కల పెంపకానికి నర్సరీలను సిద్ధం చేసుకోవాలని డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు, ఉపాధి హామీ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీల్లో నర్సరీలను సిద్ధం చేయాలన్నారు. విత్తనాలను నాటేందుకు మట్టి మిశ్రమాలను సక్రమంగా చేయాలని, నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలన్నారు. కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. పనుల గుర్తింపు వేగవంతంగా చేసి ప్రతి జాబ్‌కార్డు దారుల ఆధార్‌కార్డులను ఆన్‌లైన్ చేయాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఏపీడీ చంద్రశేఖర్, మోహన్‌లాల్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

చారకొండ: నర్సరీల్లో కొనసాగే పనులు త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండలంలోని జూపల్లి, కమాల్‌పూర్ తండాలో నర్సరీలను బుధవారం పరిశీలించారు. నర్సరీలను బ్యాగ్‌ఫిల్లింగ్‌ను పరిశీలించారు. వారి వెంట ఎంపీఓ వెంకటేష్, సైదులు, మల్లేష్ తదితరులు ఉన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలి

ఉప్పునుంతల: ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ ఫోన్ల వాడకం పెరిగిపోయినందున ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఐ శేఖర్‌గౌడ్ సూచించారు. బుధవారం మండలంలోని పెనిమిళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన సైబర్ జాగృతి దివాస్ కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొని మాట్లాడారు. అనుమానిత నంబర్ల నుంచి ఫోన్లు వచ్చినా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శేఖర్‌గౌడ్

కూలీలను తరలిస్తే కఠిన చర్యలు

కోడేరు: మండలంలోని ఆటో యజమానులు ఇతర గ్రామాలకు కూలీలను తరలిస్తే అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని మంత్రాలమ్మ ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పరిమితికి మించి ఆటోలో కూలీలను తరలించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఎవరైనా యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేందర్‌రెడ్డి

పార్టీ గెలుపునకు కృషి చేయాలి

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రాష్ట్రంలో బీజేపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషిచేయాలని బీజేపీ అచ్చంపేట పాలక్ అందె బాబయ్య అన్నారు. బుధవారం అచ్చంపేటలో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. సతీష్‌మాదిగ, నాగరాజు, రేణయ్య, జానకి పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి భక్తులు విరాళాలు అందిస్తున్నారని ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ తెలిపారు. బుధవారం ఉప్పునుంతల మండలం ఆవులోనిబావికి చెందిన చంద్రమౌళి బంధువులు సుధీర్, సునిత రూ.25 వేలు విరాళం అందజేశారు. శివ పాల్గొన్నారు.